హైదరాబాద్ నగరం నిద్రలోకి జోగుతోంది. అక్కడక్కడా వాహనాలు, పసిపిల్లలు నిద్రలో ఉలిక్కిపడి లేచినట్లు కదులుతున్నాయి. బాల్కనీలో నిలుచుని వీధి వైపు చూపులు సారిస్తోంది మీనా. నగర సౌందర్యాలు ఒకొక్కప్పుడు ఒకొక్క విధంగా వుంటాయి. సౌందర్యాన్ని ఆస్వాదించే పరిస్థితి కాదు తనది. ఎడతెగని ఆలోచనలతో సతమతమౌతోంది రెండు రోజులుగా.

# మళ్ళీ పొద్దుపొడిచింది

-కె. తాయారమ్మ



బొమ్మ: పినిశెట్టి

"ఎలాంటి నిర్ణయం తీసుకోవాలి?" భగవంతుడు తన కెందుకిలాంటి పరీక్ష పెట్టాడు?"

మెల్లగా లోపలికి నడిచింది.

తన గదిలోకెళ్ళి ట్యూబ్‌లైటు వేసింది. తెల్లని కాంతి గది అంతా పరుచుకుంది. బీరువా అట్టడుగున దాచిన కాగితాలు బైటికి తీసింది!

ఇవి ఐదు సంవత్సరాల క్రితం కాగితాలు! వెంకటప్పయ్యగారు వీటిని తనకి అప్పగించి వెళ్ళిపోయారు! ఆయన నిజాయితీ అలాంటిది!

కాగితాల్ని శరత్‌కి చూపించబోతే "వద్దు మీనా, వాటిని నీ దగ్గరే వుంచు!" అంటూ సున్నితంగా త్రోసిపుచ్చాడు.

"శరత్ మనసు అమృతతుల్యం!" వాడికి తన మీద అపారమైన నమ్మకం మరి!

అంతలోనే గతుక్కుమంది మీనా "ఆ శరత్, ఈ శరత్ ఒకరేనా?" జీవిత సత్యం తెలిసేలోపు కాలం కరిగిపోయింది! నేల ఒలికిన పాలని పాత్రలోకి ఎత్తాలన్నది వ్యర్థ ప్రయత్నమే!

ఆ కాగితాల్ని భద్రంగా సూట్‌కేసులో సర్దింది. ఎయిర్ బ్యాగు నిండా బట్టలు కూరింది. స్వెట్టర్ వేసుకుంది. మఫ్లర్ తలకు చుట్టుకుంది. అలా ఆలోచిస్తూ సోఫాలో కూచుంది! గడియారం ముళ్ళు నెమ్మదిగా కదులుతున్నాయి.

శీతాకాలంలో రాత్రులు పొడవవుతాయట! అందుకే పోతన గారు "అహములు సన్నముల య్యెను, దహనము హితవల్లయ్యె దీర్ఘదశలయ్యె నిశల్" అంటూ శీతాకాల వర్ణన చేశారు.

మళ్ళీ బాల్కనీలో కొచ్చింది మీనా. చలిగాలి రివ్వున కొట్టింది. పక్కగదిలో శరత్, ధన్య, టింకూ గాఢ సుషుప్తిలో మునిగివున్నట్లున్నారు. 'అయినా వాళ్ళతో తనకేం పని?', 'పోతూపోతూ బొల్లెద్దుకి కుడితి!' అందిట ఎవర్తో తనలాంటిదే!

'ఇంక ఈ ఇంటితోటి, ఈ మనుష్యులతోటి సంబంధం సరి! ఇటుపై తన జీవన గమ్యం ఎటు వైపో?' మొట్టమొదటిసారిగా వైరాగ్యం అంకురించింది!

గడియారం వైపు చూసింది. అది మూడు గంటలు చూపిస్తోంది. మరో గంటలో తనుబయలుదేరుతుంది! 'ఈ నిర్ణయం వెనుక ఆంతర్యం?'

వెచ్చని కన్నీటి బిందువులు చెక్కిళ్ళమీదుగా జారాయి.

ఒక్కసారి గదిలోకెళ్ళింది. డ్రాయర్ సొరుగుతీసి కలం కాగితం తీసుకుంది. ఒక్కసారి చేతులు వణికాయి. 'అయినా తప్పదు! ఏదో రాయాలి!' దృఢమైన నిర్ణయం చోటు చేసుకుంది అంతరంగంలో.

కాగితం మీద రెండే వాక్యాలు రాసింది. "శరత్ నేను వెళ్తున్నాను! నాకోసం వెతకొద్దు!"

మీనా గది బైటికొచ్చింది. శరత్ వాళ్ళ గదివైపు చూసింది. వాళ్ళు మంచి నిద్రలో వున్నట్టున్నారు. 'ఏదైతేకాని వాళ్ళు నిద్రలేవరు! అయినా ఇంకా వాళ్ళతో తనకేం పని?' మరోసారి అనుకొంది.

క్రితం రోజు రాత్రి సంగతి గుర్తొచ్చింది మీనాకి.

"మీరెన్నైనా చెప్పండి! నేను టింకూని క్రష్‌లోనే వుంచుతాను. ఉదయం మనం వెళ్ళినప్పుడు అక్కడ దించి, తిరిగి వచ్చినప్పుడు మనతో తీసుకురావచ్చు" ధన్య మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి.

"మీనా బాధ పడుతుందేమో ధన్యా!" శరత్ నెమ్మదిగా అంటున్నాడు.

"వీల్లేదు!" ఆవిడగారికి పుస్తకాల మీద వున్న శ్రద్ధ బిడ్డ మీద లేదు!" మొన్నటికి మొన్న టింకూని సోఫాలో పడుకోబెట్టుకుని పుస్తక పఠనంలో మునిగిపోయింది. వాడు కిందపడి ఏడుస్తున్నా ఆవిడగారికి పట్టలేదు!"

"మీనాకి పుస్తకాలంటే ప్రాణం!"

"నాకు నా బిడ్డ ముఖ్యం!" కఠినంగా ధ్వనించింది ధన్యగొంతు.

శరత్ మౌనం వహించినట్లున్నాడు. మరిమాటలు వినిపించలేదు!

వేదాంతిలా నవ్వుకుంది మీనా. "ఈ ఇంట్లో తన పాత్ర సరి!" మరో పాత్రలోకి పరకాయ ప్రవేశం చెయ్యాలి!

నాలుగు గంటలు కొట్టింది గడియారం. తూర్పున వేగుచుక్క పొడిచింది. తనగదిలోకెళ్ళి సూట్‌కేస్, ఎయిర్ బ్యాగు తెచ్చింది ఇవతలకి. అంతలోనే ఏదో గుర్తొచ్చినదానిలా మళ్ళీ లోపలికెళ్ళి పుస్తకాల షెల్ఫులోంచి ఓ పుస్తకం తీసింది. అది శరత్ నవల "బడాదీదీ" తనకి అత్యంత ప్రీతి పాత్రమైన పుస్తకం. దాన్ని గుండెలకి ఆనించుకుని ఇవతలకొచ్చింది.

ధనుర్మాసపు రోజులు. చలిగాలి రివ్వున వీస్తోంది. దూరంగా గుడిగంటలు మ్రోగుతున్నాయి. ఇప్పుడు వీధిలో గుడి, వీధికో మందిరం. తనకొచ్చిన తప్పుడు ఆలోచనకి చెంపలు వాయించుకుంది మీనా. మనుషులకి మానసిక ప్రశాంత తను చేకూర్చేవి, సేదతీర్చేవి ఆలయాలే కదా!

మనసులోనే భగవంతుడికి నమస్కరించింది.

నెమ్మదిగా నడిచి వీధిలోకి వచ్చింది. ఒక్కసారి వెనుదిరిగి చూసింది. తను అందంగా నిర్మించుకున్న పొదరిల్లు అది! ఇవాళతో ఈ ఇంటికీ తనకి ఋణం తీరిపోయింది!

అటువైపుగా వస్తున్న ఆటో ఆపి స్టేషన్‌వైపుగా పోనిమ్మంది మీనా.

జీవితం చిత్రమైనది.

కదులుతున్న రైలెక్కి ఓ సీట్లో చతికిలపడింది.

"భగవాన్ ఇదంతా నీ లీల!" అనుకుంటూ సీటుకి చేరబడి బైటికి చూడసాగింది.

గతం వర్తమానాల మధ్య ఊగిసలాడుతోంది మీనా అంతరంగం! నాలుగు రోజుల క్రితం తను రాసిన ఉత్తరం ఈ పాటికి ఆశ్రమానికి చేరే వుంటుంది!

తను కొత్త మజిలీకి చేరబోతోంది! గమ్యం వైపు పరుగులు తీస్తోంది రైలు.

మీనా కళ్ళల్లోంచి నీటిబిందువులు చెక్కిళ్ళ మీదుగా జారుతున్నాయి. వాటిని తుడుచుకోవాలన్న ఇంగితం కూడా కలగలేదు మీనాకి. ఇంతవరకూ తను శరత్‌ని వదిలి ఒక్క క్షణం కూడా వుండలేదు!

## కథ

నుదుటిని వేళ్ళతో రుద్దుకుంది మీనా. ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముడుతున్నాయి.

'తను ఎందుకీ సాహసం చేసింది? ధన్య మాటలకే తను ఈ నిర్ణయం తీసుకోవాలా? శరత్‌పట్ల తనకున్న మమకారం ఏమయ్యింది?'

సమాధానం దొరకని ప్రశ్నలు మూకుమ్మడిగా జనిస్తున్నాయి. శరత్ తన పేగుతెంచుకు పుట్టిన బిడ్డ. కాని... కాని... తను వాణ్ణి అలా చూడలేదు! ఒక స్నేహితులా, ఒక ఆత్మీయులా, ఒక బంధువులా ఇలా... ఎన్నో రకాలుగా చూసింది. ఇద్దరి మధ్యా తల్లీ బిడ్డల అనుబంధం తక్కువ! స్నేహ బంధం ఎక్కువ.

తనకి పుస్తకాలంటే ప్రాణం! దానికి పిచ్చిగా చెప్పుకున్నారు కొందరు. నిజానికి ఆ పుస్తకాలు కాదూ తనని పక్కదారి పట్టించకుండా కాపాడింది!

"మీనా బిడ్డ గుక్క పట్టి ఏడుస్తున్నాడు! నీకు వినిపించడం లేదూ? నీ పుస్తకాల పిచ్చిపాడు కానూ! అవేమైనా కూడు పెడ్తాయా గుడ్డపెడ్తాయా?" "నాయమ్మ రంకెలు వేసేది! అత్తగారి ధాటి తెలిసిన అమ్మ మనవణ్ణి తీసి లాలించేది!"

'ఇప్పుడా అమ్మా, నాయనమ్మా ఏరి? వాళ్ళు అప్పుడే కాలం చేశారు! తనది అందమైన గతంకాదు! కలలు కనే వయసులో కాఠిన్యం చూపింది విధి! ఆ గతం... ఆ గతం... ఏమిటి?' ఎన్నో ఏళ్ళు వెనక్కి వెళ్ళింది మనసు!

ఎదిగీ ఎదగని మనసు, విరిసీ విరియని వయసు. తుళ్ళింతలతో కేరింతలతో హాయిగా గడపవలసిన తరుణం అది! కాని... కాని... నాయనమ్మకి పెద్ద జబ్బు చేసింది. మనవరాలి పెళ్ళి చూడకుండానే పోతానేమో? "అబ్బాయ్ నా మాట విని పెళ్ళి సంబంధం చూడు!" ఒత్తిడి పెరిగి తన పెళ్ళి జరిగిపోయింది. అప్పుడు ఒక అభిప్రాయంలేదు తనకి!

మూడు నిద్రలు అయ్యేసరికి మూఢం వచ్చింది. అత్తింట అడుగుపెట్టనే లేదు! భర్త ఏదో జబ్బుచేసి పోయాడు. పిడుగులాంటి వార్త! ఇంట్లో అందరూ లబోదిబోమన్నారు!

బ్రతుకు విలువ తెలియని పసితనం తనది.

తన పెళ్ళి చేస్తే చూసిపోతానన్న నాయనమ్మ చక్కాలేచి కూచుంది!

"ఈవిడగారి కోసం ఈ పెళ్ళి ప్రయత్నం చేశాం! ఇప్పుడు పిల్ల బ్రతుకు బుగ్గి అయిపోయింది!" అంటూ నాన్న గగ్గోలు పెట్టాడు. అప్పుడు తనకేమీ అనిపించలేదు!

మామగారు వీరవెంకట సత్యనారాయణ మూర్తి గారు కబురు చేశారు! "నా కోడలు నా ఇంటికి వచ్చి వుంటే నా కూతురిలా చూసుకుంటాను!" అని. "అక్కడేముంది?" అంటూ కొట్టిపారేశారు నాన్న.

జీవితం అంటే తెలియని వయసు! అది మంచో చెడో తనకు తెలియదు! కాని... కాని... తనలో ఇంకో జీవి ప్రాణం పోసుకుంటోందని తెలిసినా నిర్లిప్తంగా వుండిపోయింది.

తన కంటే పన్నెండేళ్లు పెద్దవాడు అన్నయ్య. చదువుకున్నా ఇంటిపట్టునే వుండి వ్యవసాయం చేస్తున్నాడు. అప్పటికే వదినమ్మ కాపురానికొచ్చింది. చాలా మంచిది!

అన్నయ్య రమాకాంత్ ఆదర్శభావాలు కలవాడు! ''ఆమెకీ గర్భం వద్దు! ఆమె భవిష్యత్తుకు దెబ్బ! వెంటనే దానిని తీయించాలి!'' అన్నాడు అందరి సమక్షంలో.

''ఇదేం అఘాయిత్యం? కావాలంటే అందరికీ పిల్లలు వస్తారా? దాని అదృష్టం బాగుండబట్టి భర్త పోయినా ఈ సుకృతి మిగిలింది! దేనికైనా రాసిపెట్టి వుండాలి! నీ భార్యని చూడు కాపురానికి కొచ్చి అయిదేళ్లయినా పిల్లాలేదు! పీచులేదు!'' అంటూ దీర్ఘాలు తీసింది నాయనమ్మ!

వదినమ్మ ముఖంలో నీలి నీడలు కదిలాయి. అశ్రువులు చెంపలను తాకాయి. ''పిల్లలు లేకపోవడం ఏం డిస్క్వాలిఫికేషన్ కాదు! ముందు మీనాక్షి సంగతి మాట్లాడండి!'' అన్నాడు అన్నయ్య కోపంగా.

''ఇంక మాట్లాడేది, ఆలోచించేది ఏమీ లేదు! మీనాక్షి చక్కగా బిడ్డను కంటుంది!'' ఇంట్లో అందరూ ఏకగ్రీవంగా అన్నారు.

నిస్సహాయంగా చూస్తూ వుండిపోయాడు అన్నయ్య.

ఏమీ తెలియని తనం తనది!

వదినమ్మ శ్రీప్రద తనని కంటికి రెప్పలా కాపాడ సాగింది. పాలలో కుంకుమ పువ్వువేసి యిచ్చి, ''ఇవి తాగు మీనా పండంటి బాబు పుడతాడు!'' అనేది ప్రేమ పూర్వకంగా.

తనకి పుస్తకాలంటే పిచ్చి! ఆ ఊళ్లో వున్న కస్తూర్బా గ్రంథాలయానికెళ్లి బోలేడన్ని పుస్తకాలు చదివేది! పత్రికలు చదివేది! తన ప్రపంచమే పుస్తకాల ప్రపంచం!

అన్నయ్య అప్పుడప్పుడు పట్నం వెళ్తే కొత్త నవలలు కొని తెచ్చేవాడు. వాటిని క్షణాలలో చదివి, ''మళ్ళీ పట్నం ఎప్పుడు వెళ్తావన్నాయ్యా?'' అంటూ అడిగేది తను!

''అదృష్టవంతురాలివి మీనా నీ ప్రపంచమే వేరు!'' అన్నయ్య అనుక్షణం అనే మాట ఇదే!

ప్రాచీన సాహిత్యం మొదలు ఆధునిక సాహిత్యం వరకు చదివింది తను. ఇది వరలో అన్నయ్య తనని వెక్కిరించేవాడు. 'నవలా మణి' అని నీకు పేరు పెట్టి వుండాల్సింది అని!

అన్నింటి కన్నా తనకి బెంగాలీ రచయిత శరశ్చంద్ర ఛటర్జీ నవల అంటే చాలా ఇష్టం! అందునా ''బడదీదీ'' నవల అంటే మరీను!.. 'బడ దీదీ'లో నాయిక మాధవి బాల వితంతువు! నాయకుడు సురేంద్ర! అమాయకుడు. అతనికేది కావాలో అతనికే తెలియని ఓ వింత మనస్తత్వం కలవాడు!

వాళ్లిద్దరి మధ్యా సాగుతుంది కథ! సంఘపు కట్టుబాట్లకి లోబడి తన జీవితాన్ని తనే కట్టుదిట్టం చేసుకున్న త్యాగమయి మాధవి.

నిజ జీవితంలో రాజీపడలేక, తన మనసువిప్పి ఆమెతో చెప్పలేక ఓ బాటసారిగా సాగిపోతాడు సురేంద్రనాథ్!

'ఇద్దరూ దైహోపహతులే!' మరి తను? తన గురించి తను ఆలోచించుకునే శక్తి లేదు తనకి!'

రోజులు దొర్లుతున్నాయి. తనకి నెలలు నిండుతున్నాయంటున్నారు అందరూ! తనలో ఏదో వింత కదలిక!

తనకి చిన్నప్పటినించీ ఆకతాయిగా అల్లరి చిల్లరిగా ఆటలాడుకుంటూ గడపడం అలవాటు? కాని ఇప్పుడు కట్టుదిట్టం చేస్తున్నారు ఇంట్లో! ''ఏమిటి మీనా ఇంకా చిన్నపిల్లవి అనుకుంటున్నావా? ఏమిటా అల్లరి?''

గ్రంథాలయానికి కొత్త పుస్తకాల కోసం వెళ్తూ దార్లో ఎందర్నో పలకరిస్తూ వుండేది తను. ''సుబ్బరాజు మామయ్యా నీ పెళ్ళాం మళ్లీ పుట్టింటికి పోయిందా? నీ గతి అంతేలే అనో, నీ కూతుర్ని అత్తారింటికి పంపవా అలమేలత్తా?'' అంటూనో దారికోసాకు భోగట్టాలు చేసేది తను!

''మీనాక్షీ నీకు ఇంకా చిన్నతనం పోలేదు సుమా!'' అనేవారు కొందరు! ''దీని బతుకు తెల్లారిపోయిందన్న సంగతి దీనికి ఇంకా తెలిసినట్లు లేదు!'' ''కడుపు మీదకొస్తున్నాక కబుర్లు తగ్గలేదు!'' అని కొందరూ అంటూ వుండేవారు! వాటి అర్థం నాడు తనకి తెలియదు!

''దీని దురదృష్టం కొద్దీ ఆ మొగుడు కాస్తా పోయాడు. బతుకంతా ఎలా వెళ్ల దీస్తుందో?'' నాయనమ్మ రోజూ అష్టోత్తరం వినిపించేది!

రోజులు దొర్లుతున్నాయి. తనలో మహత్తరమైన మార్పు! అడుగులు భారంగా పడుతున్నాయి. మునపటంత చలాకీగా వుండలేక పోతోంది!

బిడ్డ పుట్టాడు. చందమామలాగున్నాడు. చిన్ని నోరు, బూరె బుగ్గలు, ఎర్రని పెదాలు, చిన్ని రబ్బరు బొమ్మలా ముద్దుగా వున్నాడు.

వాడు తనకి బిడ్డలా అనిపించలేదు! ఆటబొమ్మలా అనిపించాడు.

అదే రోజు ఓ ఘోరమైన నిజం తెలిసింది. అన్నా వదినా ఎక్కడికో వెళ్లొచ్చారు! వదినమ్మ ఏడుస్తోంది! విషయం తెలిసింది. వదినమ్మకి పిల్లలు పుట్టరట! ''దేనికైనా అదృష్టం వుండాలి!'' అంటూ దీర్ఘాలు తీసింది నాయనమ్మ.


తన తెలిసీ తెలియని మనసులో ఒక ఆలోచన విరిసింది! ఎర్రని రక్తపు గడలా వున్న పురిటిబిడ్డని చేతులలోకి తీసుకుంది. మెల్లగా లేచింది. నాలుగడుగులు వేసింది. బిడ్డని వదినమ్మ చేతులలో పెట్టింది! ''వీడు నా బిడ్డ కాదు! నీ బిడ్డ!'' అంది!

''ఎంత అఘాయిత్యం! గొడ్రాలి చేతికెవరైనా బిడ్డనిస్తారా?'' అంది నాయనమ్మ.

''వదినమ్మ గొడ్రాలు కాదు!'' మళ్లీ పుస్తకాల తోటే కాలక్షేపం! ''పచ్చి బాలింతరాలివి! కళ్లుపోగలవు!'' నాయనమ్మ నానా యాగీచేసింది!

''వదినమ్మ వుందిలే!'' అంది.

''పిల్లాడికి పేరు పెట్టాలి! ఏం పేరు?'' ఇంట్లో



చర్చ జరుగుతోంది. ''ఇంకెవరి పేరు?'' వాళ్ల మామగారి పేరు! వీరవెంకట సత్యనారాయణ మూర్తి! అంది నాయనమ్మ.

''కాదు! శరత్ బాబు!'' అంది దృఢంగా.

''ఎవరి పేరు?''

''నా అభిమాన రచయిత పేరు!''

హవ్వ నోరు నొక్కుకుంది నాయనమ్మ. అన్నా వదినలు తనని సమర్ధించారు.

'అది మొదలు శరత్‌తో తను ఆటలు, పాటలు, వాడి ఆలనా పాలనా వదినమ్మ చూసేది. వాడి ఆకలి తనకి తెలిసేది కాదు! వదినమ్మ వెండి గిన్నెలో పెరుగన్నం కలిపి తినిపించేది వాడు ఏడాది వాడయ్యేక.

వాణ్ణి నడిపిస్తూ, వాణ్ణి గెంతిస్తూ వాడితో ఆటలు ఆడేది తను!

శరత్‌కి మూడేళ్లొచ్చేసరికి నాయనమ్మ, ఆ వెంటనే నాన్న, అమ్మ ఒకరి వెంట ఒకరు కూడబలుక్కున్నట్టు ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయారు!

అప్పుడు మామగారి దగ్గర నించి కబురొచ్చింది అన్నయ్యకి. మీ తల్లి తండ్రులు పోయినందుకు విచారిస్తున్నాను! ఇప్పుడు మీనాక్షి పరిస్థితేమిటో ఊహించగలను! నా కొడల్ని, నా మనవణ్ణి నా ఇంటికి పంపిస్తే సంతోషిస్తాను!'' అంటూ.

''నా చెల్లెలు నాకు బరువు కాదు!'' అంటూ అన్నయ్య తేల్చి చెప్పేశాడు.

తరువాత ఒక విచిత్రం జరిగింది.

అన్నయ్య స్నేహితుడు శివరాజ్ అన్న తాను ముంబై నించి వచ్చాడు. అతను తనని చూసి, ''రమాకాంత్ నీ చెల్లెలు మీనాక్షి నాకు నచ్చింది! నీకు అభ్యంతరం లేకపోతే నాకిచ్చి పెళ్లి చెయ్యి! బిడ్డతో సహా స్వీకరిస్తాను!'' అన్నాడు. అన్నయ్య, వదిన ఒప్పించాలని చూశారు. తను అంగీకరించలేదు!

ఇంతలో మరో ఘోరం జరిగింది వదినమ్మ కూడా వెళ్లిపోయింది అందరాని లోకాలకి.

శరత్ పెరుగుతున్నాడు. తను వాడితో ఆడుకుంటోంది. వాడి స్కూల్‌కెళ్లి మధ్యలో వాణ్ణి తీసుకొచ్చి చెట్లమ్మటా, పుట్టలమ్మటా తిప్పుతోంది.

అన్నయ్య, వదినమ్మ తనని ''మీనా!'' అని పిలవడంతో వాడికి కూడా అదే అలవాటయ్యింది! తనకీ అది బాగానే తోచింది.

తను చదివిన నవలలు, కథలు వాడికి చెప్తుంది. వాడితో దాగుడు మూతలు ఆడుతుంది! వెన్నెల కుప్పలు ఆడుతుంది! కేరమ్స్ ఆడుతుంది. చెస్ ఆడుతోంది!

పరుగులు తీస్తుంది.

''ఈ పిల్ల చాలా విచిత్రమైన పిల్ల!'' అంటూ నవ్వేవారు వెంకటప్పయ్యగారు. ఆయన తమకి దూరపు బంధువు! తనకి తండ్రిలాంటివారు. తనంటే చాలా అభిమానం ఆయనకి.

శరత్‌తో పదవ తరగతి ఫస్టుక్లాసులో ప్యాసైనప్పుడు అన్నయ్య సంతోషం అంతా ఇంతా కాదు! వాణ్ణి పై ఊళ్లో హాస్టల్లో వుంచి చదివించాలనీ అన్నయ్య అన్నప్పుడు, తనో స్నేహితుడుణ్ణి దూరం చేసుకోబోతున్నందుకు విలవిల లాడింది. సెలవులు సెలవులకీ వస్తాడుగా!'' అంటూ అన్నయ్య తనని ఊరడించాడు.

అయిదేళ్లు అయిదు ఫణాల్లాగడిచాయి. శరత్ డిగ్రీ పాసయ్యేడు. ఒడ్డూ పొడుగ్గా తనే పోల్చుకోలేనట్టుగా మారిపోయాడు శరత్!.

వెంటనే అన్నయ్య పలుకుబడితో హైదరాబాద్‌లో మంచి కంపెనీలో ఉద్యోగం వేయించాడు.

తనూ శరత్ హైదరాబాద్ వచ్చేరు. అన్నయ్య పల్లె వదిలి రానన్నాడు. కొద్ది రోజులలోనే తన బంగారాలు, తల్లి తండ్రులిచ్చిన మడిచెక్క అన్నీ అమ్మి చిన్న పొదరిల్లు లాంటి ఇల్లు నిర్మించుకుంది!

''మీనా ఇది విను! ఇది చూడు, ఈ సెల్ నీకు తీసుకున్నాను!'' నేనెక్కడున్నా నువ్వు నాతో మాట్లాడచ్చు! అంటూ తన వెను వెనుకే తిరుగుతూ వుంటాడు శరత్.

ఇద్దరూ పార్కులకెళ్తారు, సినిమాలకెళ్తారు, కలిసి టీ.వీ చూస్తారు! పుస్తకాలు చదివి చర్చించుకుంటారు! ''తను అనుబంధమే వారు!'' తామిద్దరిది స్నేహ బంధం!

తను బిడ్డని కన్నా తనలో మాతృత్వం లేదు! వదినమ్మ బిడ్డని కనకపోయినా ఆమెలో నిండారిన మాతృత్వం వుంది! ''ఏమిటీ వైచిత్రి?''

తామిద్దరినీ చూసినప్పుడు ''మీతమ్ముడా?'' అంటూ అడుగుతారు, చాలా మంది.

''అవును మీనా నువ్వు నాకు నిజంగా అక్కవే కదూ?'' అంటూ నవ్వుతాడు.

రోజులు దొర్లుతున్నాయి.

శరత్ పెళ్లి చూపులు కూడా చాలా తమాషాగా జరిగాయి. అవి శరత్ చెప్తున్నప్పుడు ఎంత నవ్వుకున్నారో ఇద్దరూ కలిసి.

శరత్ చెప్పిన వెర్షన్

''మీ పేరు?''

''ధన్య!''

''చాలా బావుంది!'' ''నా పేరు చెప్పనా?'' ''శరత్!'' ''మీనాకి శరత్ నవలలంటే చాలా ఇష్టం!'' అందుకే ఆ పేరు పెట్టింది!

కనులెత్తి బరువుగా చూసింది ధన్య.

''మీనా చాలా యాక్టివ్!'' అందరూ నవ్వుతూ తుళ్లుతూ వుండాలంటుంది!''

''ఐ సీ!'' పెదవులు విడీవిడనట్లు నవ్వింది.

''మీనాకి సాహజత్యం మీద మక్కువ ఎక్కువ!''

''అలాగా! నాకు పుస్తకాలంటే గిట్టవు!'' అందునా కథలు నవలలు అంటే మరీను!

ఏటి నీటిలో గులకరాయి పడినట్లయ్యింది శరత్‌కి.

''మీనా నేను ఎన్నో విషయాలు చర్చించుకుంటూ వుంటాం.''

''మేం ఇద్దరం క్లాస్‌మేట్స్‌లా వుంటాం!, స్నేహితుల్లా వుంటాం.''

ఈ సారి మౌనం సమాధానం అయ్యింది.

''మీరు నాకు నచ్చారు. నాకు నచ్చితే మీనాకి నచ్చినట్లే వస్తాను.''

''మీనా ఎవరు?'' వీపులోంచి దూసుకొచ్చిన ప్రశ్నకి వెనుదిరిగాడు.

''మా మమ్మీ''

విస్మయంగా చూసింది ధన్య.

మరొక నెల రోజులలో ధన్యని పెళ్లిచేసుకుని తీసుకువచ్చాడు శరత్. తను పెళ్లికి వెళ్లలేదు. 'ధన్య బావుంది' తనని చూసి ఆశ్చర్యపోయింది.

''మీనా'' అంటూ పరిచయం చేశాడు శరత్ తాతని.

''ఈ మీనా మీ మమ్మియా?'' నవ్వింది ధన్య. ఆ నవ్వులో హేళన ధ్వనించింది.

''తప్పదు'' శరత్‌కి నచ్చిన పిల్ల.

కోడలొచ్చిన మర్నాడు కాఫీకప్పుతో వెళ్లింది శరత్ దగ్గరకి. ''నేను కాఫీ తాగాను మీనా. ధన్య ఐదు గంటలకే యిచ్చింది'' అన్నాడు శరత్ పేపర్లోంచి తల తిప్పకుండానే.

మొట్టమొదటిసారిగా మనస్సు చివ్వుక్కు

## సెలీనా హాలీవుడ్ కష్టాలు

బాలీవుడ్‌లో అవకాశాల్లేక కనుమరుగైన హీరోయిన్ సెలీనా జైట్లీ ఇప్పుడు ఏకంగా హాలీవుడ్‌లో పాగా వేసింది. ఒకటి కాదు ఏకంగా రెండు చిత్రాల్లో నటిస్తోంది. ఆస్కార్ అవార్డు పొందిన ప్రముఖ హాలీవుడ్ నటుడు సర్. సీన్ కానరీ సరసన 'క్వెస్ట్ ఆఫ్ షెహర్ జేడ్' అనే సినిమాలో నటిస్తోంది. దీన్ని 'అరేబియన్ నైట్స్' ఆధారంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర దర్శకుడే నిర్మిస్తున్న మరో చిత్రం 'లవ్ హేస్ నో లాంగ్వేజ్'లో కూడా ఆమె ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇందులో ఆమె న్యూజిలాండ్‌లో పెరిగిన భారత దేశం అమ్మాయిగా నటిస్తోంది. దీనికోసం న్యూజిలాండ్ యాసలో ఇంగ్లీషు మాట్లాడటానికి చాలా కష్టపడిందట. ''న్యూజిలాండ్ వాళ్ళలో యాసలో ఇంగ్లీషు మాట్లాడాలంటే చాలా ఇబ్బంది. వాళ్ళు ఆస్ట్రేలియన్లలాగా, బ్రిటిష్ వాళ్ళలాగా, అమెరికన్ల లాగా మాట్లాడరు. వాళ్ళ వింత యాస నేర్చుకోవడానికి నాకు చాలా కష్టమైంది. ఒక ట్రైనర్‌ని నియమించారు. ఆమెతో ఒక పది రోజులు రాత్రింబవళ్ళు కూర్చుంటే తప్ప నాకా యాస పట్టు బడలేదు,'' అంటోంది. హాలీవుడ్ అంటే మాటలా మరి!



మంది. 'ప్రాణస్నేహితుడు దూరమవుతున్నాడా?, తామిద్దరి మధ్యా వున్న ఆత్మీయతాభావం కనుమరుగవుతోందా?'

సన్నని నీటితెర కదిలింది కన్నులలో.

క్రమేపీ ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి ఆ ఇంట్లో.

"శరత్ ఈ పుస్తకం చదివారా? చాలా బావుంది సుమా!"

"చదివే తీరిక లేదు మీనా" అంటూ తప్పించుకునే వాడు శరత్. మంచి సాహిత్య కార్యక్రమానికి వెళ్దామంటే, "నాకు పరమబోర్ మీనా! నువ్వెళ్లు. ధన్య సిన్మా ప్రోగ్రామ్ పెట్టింది."

శరాఘాతానికి గిలగిలలాడిన హంస చందంలా అయ్యింది (మీనా) తన హృదయం.

ఏనాడూ తనతో కలిసికట్టుగా వుండలేదు ధన్య. తననొక పరాయి మనిషిలా చూడసాగింది. "మీనా ఏంటి అసహ్యంగా! 'మమ్మీ' అని పిలవలేరా?" ఎన్నోసార్లు శరత్‌తో అనగా వింది తను! మనస్సు తూట్లు పడుతోంది అనుక్షణం. 'ఏం చెయ్యాలి?' జీవితం అగమ్య గోచరంలా అనిపిస్తోంది.

శరత్ అన్న ఒక్క మాటతో మనస్సు వికలమైపోయింది. "మీనా నువ్వు చిన్నపిల్లవి కావు! పక్క ఇంటి పద్మావతమ్మగారితో కలిసి ఏ గుడికో గోపురానికో వెళ్లొచ్చుగా!"

పద్మావతమ్మగారి వయస్సు డెబ్బై ఐదు! తన వయసు నలభై దాటింది! తనకీ శరత్‌కీ పదహారేళ్లు తేడా!

కాలం పరుగులు తీస్తోంది. ధన్య ఉద్యోగంలో చేరింది. టింకూ పుట్టాడు. 'నిజంగా తను పిల్లాణ్ణి పెంచలేదేమో?, మాతృత్వపు విలువ తనకి తెలియదేమో? తను అమ్మతనం లోని కమ్మదనాన్ని ఎప్పుడు అనుభవించింది?'

రైలు ఒక్క ఊపుతో ఏదో స్టేషన్‌లో ఆగింది. గతంలోంచి వర్తమానంలోకి వచ్చింది మీనా. కాదు మీనాక్షి.

కొద్ది నిముషాలు ఆగి మళ్లీ ఊపందుకుంది బండి.

చటుక్కున ఒక్క విషయం గుర్తొచ్చింది మీనాక్షికి. సూట్‌కేసు తీసి తనతో తెచ్చుకున్న కాగితాలు బైటికి తీసింది. అది మామగారు తన పేర రాసిన ఆస్తిపాస్తులు. ఇల్లు తన పేర రాసేరు. భూములమ్మిన సొమ్ము తాలూకు కాగితాలు, అన్నీ వెంకటప్పయ్యగారు తనకి అందించారు.

కొండంత ధైర్యం అంకురించింది మీనాక్షిలో.

ఏనాడో ఋణపడ్డాడు మామగారుగా చెప్పబడే ఆయన.

రైలు ఇంకో స్టేషన్‌లో ఆగింది. పెట్టె, సూట్‌కేస్ పట్టుకుని కిందకు దిగి బైటికొచ్చింది మీనాక్షి. ఆటో వాళ్లు చుట్టుముట్టారు. ఓసారి అడ్రసు కాగితం చూసుకుని అక్కడికి పోనిమ్మంది ఆటోని.

ఆశ్రమం ముందు ఆగింది ఆటో. ఆటోకి డబ్బులిచ్చి లోపలికి నడిచింది. ఆశ్రమంలో వాళ్లు సాదరంగా ఆహ్వానించారు.

ఎందరో పసిపిల్లల్ని చూపించారు వాళ్లు. మూడు నెల బాలుణ్ణి ఎంపిక చేసింది మీనాక్షి. వాడు పాలవెల్లిలా నవ్వుతున్నాడు.

ఆ నవ్వు మీనాక్షి హృదయాన్ని తాకింది.

వాడి చిన్ని బొజ్జకిన్ని పాలు పోస్తే చాలు!

అన్ని సంతకాలు చేసి, పసికందుని తీసుకుని బయలుదేరింది. 'ఎక్కడికి?' మామగారు తన పేర రాసిన ఇంటికి! తనదైన ఇంటికి తన బిడ్డని తీసుకుని... బయలుదేరింది నూతనోత్సాహంతో.

***

మూడు నెలల తరువాత! తొలిపొద్దు పొడుపు వేళ తన ఇంటి ముందు అందమైన పూలమొక్కల మధ్య, భగవద్గీత చేతపట్టుకుకూచుంది మీనాక్షి.

ఆకుల మీంచి ఆణిముత్యాల్లాంటి మంచుబిందువులు కరిగినీరై నేలరాలుతున్నాయి.

ఒకవైపు భగవద్గీతాసారం, ఇంకోవైపు జీవన సారం, 'ఏది?' 'ఏది ముఖ్యం?' కృష్ణభగవానుడు పాపుల్ని శిక్షించడానికి, భక్తుల్ని రక్షించడానికి ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క అవతారం ఎత్తుతానన్నాడు.

దూరంగా ఎవరో వస్తూ కనిపించారు.

వాళ్లు...వాళ్లు...శరత్, ధన్య, టింకూని ఎత్తుకుని నిలుచున్నారు.

"మీనా" శరత్ గొంతులో ఆర్ద్రత నిండి వుంది.

"మీనా కాదు మీనాక్షి!" దృఢత్వం ధ్వనించింది మీనాక్షని గొంతులో.

"మా తప్పుల్ని మన్నించి ఇంటికిరా మీనా!"

"నా ఇల్లు ఇదే! నేను రాలేను! నాకు ఇప్పుడు స్నేహితుడు అక్కరలేదు, ఆత్మీయుడు అక్కరలేదు, సహపాఠకుడు అక్కరలేదు, నేను చెప్పే విషయాలకు శ్రోత అక్కరలేదు."

"నాకు నా బిడ్డకావాలి. నాలాలనలో వాడు తడిసి ముద్దకావాలి. నా మాతృత్వపు ఝరిలో వాడు ఓలలాడాలి."

"అందుకే ఇంతదూరం వచ్చాను. నా ఇంటిని నేను తీర్చి దిద్దుకున్నాను. చిన్ని చందమామను తెచ్చుకున్నాను. బాలార్జునుణ్ణి అక్కున చేర్చుకున్నాను. శరత్ నువ్వు వెళ్లు! నా ప్రపంచంలో నన్ను బ్రతకనియ్యి!"

"మీనా...మీనా... ఈ వయసులో ఈ బిడ్డ నలుగుర్లో ఎంత హాస్యాస్పదంగా వుంటుందో ఆలోచించేవా?"

పగలబడినవ్వింది మీనాక్షి. "నువ్వు భయపడకు శరత్! నేను నీ ఛాయలకి కూడా రాను!"

"వస్తాను మీనా!" వెనుదిరిగాడు శరత్ భార్యతో సహా.

"మీనా కాదు మీనాక్షి" అని మరోసారి అని, "శరత్ నీ చిట్టి తమ్ముణ్ణి చూడవూ? ఇడిగో!" అంటూ లోపలికెళ్లి పసివాణ్ణి తీసుకొచ్చింది ఇవతలకి. బాలసూర్యుల్లా వెలిగిపోతున్నాడు వాడు.

"శరత్ ఇడిగో నీ చిట్టి తమ్ముడు! వీణ్ణి నేను స్నేహితుల్లా చూడను. నాకు నచ్చినట్టు పెంచుతాను!"

"వీడి పేరేంటో తెలుసా శరత్? ఏ రచయిత పేరు కాదు! నాకు నచ్చిన నవలా హీరో పేరూ కాదు! వీరవెంకట సత్యన్నారాయణ మూర్తి! మీ తాతయ్య పేరే!" ఎద నిండిన సంతృప్తితో అంది మీనాక్షి ఆ నెలబాలుణ్ణి ముద్దాడుతూ.

వెనుదిరిగి నాలుగడుగులు వేశాడు శరత్.

"అన్నట్టు శరత్ వీడిచేత నేను 'మీనా' అని పిలిపించుకోను 'అమ్మా' అని పిలిపించుకుంటాను" అంది మీనాక్షి అమ్మతనంలోని కమ్మతనాన్ని ఊహించుకుంటూ.

తూర్పున సూర్యోదయం అందంగా కనుపిస్తోంది.

*

## మీరా జాస్మిన్‌కు లభించిన శ్రీవిద్య స్మారక అవార్డు





గతంలో అనేక సినిమాల్లో కేరెక్టర్ ఆర్టిస్టుగా నటించి రెండేళ్ళ క్రితం మరణించిన నటి శ్రీవిద్య గుర్తుండే ఉంటుంది. ఆమె జ్ఞాపకార్థం మలయాళం సినీ పరిశ్రమ ఒక అవార్డును స్థాపించింది. ఉత్తమ నటనను ప్రదర్శించిన నటీమణులకు ఈ అవార్డు ఇవ్వాలని సంకల్పించింది. మొదటి అవార్డును ఇటీవలే ప్రకటించింది. 'ఒరే కాదల్' అనే చిత్రంలో ఉత్తమ నటనను ప్రదర్శించినందుగ్గాను మీరా జాస్మిన్‌కు ఈ అవార్డు లభించింది. ప్రస్తుతం మలయాళ సినీ పరిశ్రమ 'ఎమ్. ఎల్. వి. శ్రీవిద్యా ఛారిటబుల్ సొసైటీ' పేరిట ఒక సేవా సంస్థను స్థాపించింది. అంతేకాక ఆమె పేరిట ఒక కేన్సర్ ఫౌండేషన్‌ను కూడా స్థాపించే ఉద్దేశ్యంతో ఉంది.